క్లుప్తంగా

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



బేస్తవారిపేట: మండలంలోని గొట్టిమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గుంటి గంగా భవానికి విశేష పూజలు



అలంకరణలో గుంటి గంగా భవాని అమ్మవారు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి రూ. 6, 255 ఆదాయం వచ్చినట్లు ఆర్ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నీలంపాటి అమ్మవారికి ప్రత్యేక పూజలు

తర్లుపాడు: స్థానిక నీలంపాటి అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారి ఆలయానికి వెళ్లి పొంగళ్ళు నైవేద్యం సమర్పించి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. సమీప గ్రామాల ప్రజలు కూడా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

దళితులపై దాడి చేసేవారిని శిక్షించాలి

అర్థవీడు (కంభం): దళితులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని షెడ్యూల్డు కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని పోతురాజుటూరు గ్రామంలో పొలం వద్ద ఏర్పడిన వివాదంలో దళితులపై 16 మంది వచ్చి దూషిస్తూ దాడి చే సారని వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని కోరారు.

ఘనంగా వీరరాఘవ శాస్త్రి వర్ధంతి

యర్రగొండపాలెం: బహు గ్రంథకర్త, గద్వాల ఆస్థాన కవి గాడేపల్లి వీరరాఘవ శాస్త్రి 79వ వర్ధంతిని ఆదివారం త్రిపురాంతకంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కాపురం రోడ్డులోని వీరరాఘవ శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌నాయుడు, ప్రముఖ కవి, రిటైర్డ్ లెక్చరర్ దేవులపల్లి విశ్వనాథం, తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరి గడ్డి వామి దగ్ధం



వరి గడ్డిని ఆర్పుతున్న అగ్నిమాపకదళ సిబ్బంది

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లెలో ప్రమాదవశాత్తు వరిగడ్డికి నిప్పు అంటుకుని దగ్ధమైన సంఘటన ఆదివారం జరిగింది. సాతర్ల చెన్నయ్య పశువుల మేత కోసం వరి గడ్డిని ఇంటికి సమీపంలో నిల్వ చేసుకున్నాడు. ప్రమాదవశాత్తు వరిగడ్డికి నిప్పంటుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా కంభం అగ్నిమాపకదళ సిబ్బంది అదుపులోకి తీసుకొచ్చారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి పడిపోయి తీవ్రగాయాల పాలైన ఘటన ఆదివారం సాయంత్రం మార్టూరులో చోటు చేసుకుంది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ అందించిన సమాచారం ప్రకారం దర్శికి చెందిన కే ప్రసాద్‌రెడ్డి తన బైకుపై విజయవాడలో పరీక్ష రాసి తిరిగి తన గ్రామానికి వెళ్తున్నాడు. మార్టూరు చైతన్య స్కూలు సమీపంలో జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కాగా అతనిని 108 సిబ్బంది చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాబోయ్ భౌ..భౌ



గొట్లగట్టు బస్టాండ్ సెంటర్‌లో శునకాలు

- భారీ సంఖ్యలో సంచరిస్తున్న శునకాలు
- కుక్క కాటుకు గురవుతున్న ప్రజలు
- తిప్పలు పెడుతున్న కోతులు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు రాజ్యమేలుతున్నాయి. ఎక్కడ చూసినా గుంపులు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. పెద్దలతో పాటు చిన్నారులు కుక్క గాట్ల పాలవుతున్నారు. ఏది మంచిదో, ఏది పిచ్చి కుక్కో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల గొట్లగట్టు, బసాపురంలో కుక్కలతో పాటు కోతులు కూడా దాడి చేయడంతో ఆందోళన తీవ్ర తరమైంది. రోడ్ల మీదకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. కుక్కగాటుకు గురైన వారు ఆసుపత్రులకు వెళ్లి ఇంజక్షన్‌లు వేయించుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా శునకాలు సంచరిస్తూ పాదచారులను కరుస్తున్నాయి. యువకులు కర్రలు తీసుకొని వీధుల వెంట తిరుగుతూ వాటిని బెదర గొడుతున్నారు.



వీధుల్లో సంచరిస్తున్న కోతులు

విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దండి



వెంకాయమ్మను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

దర్శి: పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా విద్యను అందించాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక గౌతమి గ్రామర్ స్కూల్‌లో 13వ వార్షికోత్సవంలో ఆమెతో పాటు నరసరావు పేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్ పాపసాని రాజశేఖరరెడ్డి వారిని దుశ్శాలువాలు మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. విద్యలో వస్తున్న నూతన మార్పులను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి, ప్రముఖ హోమియో వైద్యులు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాషా, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి



తాళ్లూరులో ప్రచారం చేస్తున్న నాయకులు



గిద్దలూరులో ప్రచారం చేస్తున్న నాయకులు



కొనకనమిట్ల: ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ, నాయకులు

తాళ్లూరు: తూర్పు రాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. బెల్లంకొండ వారిపాలెం, దోసకాయలపాడు, లక్కవరం, నాగంబొట్లపాలెంలో ఆదివారం జెడ్పీటీసీ మారం వెంకట రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాస రెడ్డి, సర్పంచులు వలి, పీఎస్ శ్రీకాంత్ రెడ్డి, సొసైటీ చైర్మన్ శనివారపు శ్రీనివాస రెడ్డి, మాజీ సర్పంచి టీవీ సుబ్బా రెడ్డి, సచివాలయ కన్వీనర్ కోట వెంకటేశ్వర రెడ్డి, కైలాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటి గెలుపు కోసం కృషి

ముండ్లమూరు: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాదరెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని మండల సచివాలయాల కన్వీనర్ మేడికొండ జయంతి తెలిపారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని వేముల, ఉమామహేశ్వరపురం, వేములబండ, రమణారెడ్డి పాలెం, కమ్మవారిపాలెం, రాజగోపాలరెడ్డి నగర్, నాయుడుపాలెం, తమ్మలూరులో పర్యటించారు. వైస్ ఎంపీపీ పద్మాజానకీ రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు బద్రి సుబ్బారెడ్డి, దుగ్గినేని వెంకట్, నంబూరి గురవయ్య, గోపనబోయిన అంకాలు పాల్గొన్నారు.



ముండ్లమూరు: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జయంతి, వైఎస్సార్ సీపీ నాయకులు

గిద్దలూరు రూరల్: స్థానిక 9వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ భర్త వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దర్ల శ్రీను మాట్లాడుతూ పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జనార్దన్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లకు బ్యాలెట్ నమూనా అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొనకనమిట్లలో...

కొనకనమిట్ల: పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిల విజయాన్ని కాంక్షిస్తూ ఎంపీపీ మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ ఏడుకొండలు, సచివాలయ కన్వీనర్ యస్. పెద్ద వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మోరా శంకర్‌రెడ్డి, గురవారెడ్డి, కోటేశ్వర రావు, తదితరులు ఆదివారం మండలంలో పర్యటించారు. సర్పంచ్ అంజనికుమారి, మురళీకృష్ణ, ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లు, ఉన్నం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

పెద్దారవీడు: వైఎస్సార్ సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. మండలంలోని సానికవరం, మద్దలకట్ట, చట్లమిట్ల గ్రామాల్లో ఓటర్లకు ఆదివారం కరపత్రాలు, బ్యాలెట్ నమూనాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎంవీ రమణారెడ్డి, పార్టీ సోషల్ మీడియా మండల, నియోజకవర్గ కన్వీనర్లు ఒద్దుల లక్ష్మీరెడ్డి, సొంటి నాగార్జునరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పోటు గంగయ్య, మూల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వితా సుబ్బరత్నం కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని మెరిట్ గల ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ఆదివారం ఆర్యవైశ్య సంఘం నాయకులు టి.సత్యనారాయణ ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యలో ప్రతిభ గల 17 మంది విద్యార్థులను గుర్తించి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున అందజేస్తున్నామన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పీరయ్య, నరసింహారావు ప్రసంగించారు. సంఘ నూతన అధ్యక్షుడిగా బొగ్గరపు వెంకటసుబ్బయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న శిద్దా సుధీర్ కుమార్

తాళ్లూరు: విద్యార్థులు తమ బాధ్యతను తెలుసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్ కుమార్ అన్నారు. తూర్పుగంగవరంలో గీతాంజలి హైస్కూల్‌లో జరిగిన వార్షికోత్సవంలో ప్రసంగించారు. ఎస్సై ప్రేమ్‌కుమార్, పాఠశాల డైరెక్టర్ యాత శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



మార్కాపురం: అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



మార్కాపురం: పోలేరమ్మకు పొంగళ్లు వండుతున్న భక్తులు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు మూడో ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. మార్కాపురంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించటం ఆనవాయితీ. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కుంకుమ బండ్లతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారి వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. బోనాలను సమర్పించారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు అన్ని ఏర్పాట్లను చేశారు. ఆలయం ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాగమయ్య శిలలు, నాగమయ్య పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మార్కాపురంలోని కాలేజి రోడ్డులో ఉన్న పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

కనులపండువగా గ్రామోత్సవం



కరేడులో ధ్వజ స్తంభ గ్రామోత్సవం

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడులో నూతనంగా నిర్మించిన కృష్ణుడి గుడి ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముందుగా ధ్వజస్తంభ సహిత కృష్ణ పరమాత్మ శిలా విగ్రహం గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం అనుజ్ఞ పుణ్యాహం, అంకురార్పణం, ధాన్యాధి వాసం కార్యక్రమాలు జరిపారు.

వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగేశ్వరరావు, ఉమాశంకర్ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చన చేశారు. వాహన పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ రమేష్ ఏర్పాట్లు చేశారు.

ఎన్‌యంయూ నేతకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

మార్కాపురం: ఆర్‌టీసీస నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పి. రామోహన్ రావు 18వ వర్ధంతిని ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ యన్‌యంయూ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. యూనియన్ నాయకులు ఏ. కాశయ్య, నాగిరెడ్డి, మల్లీఖార్జున్, సత్యనారాయణ, శివారెడ్డి, శ్రీను, హనీఫ్, మూర్తయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీమహాలక్ష్మమ్మ జయంతి ఉత్సవాలు



శ్రీమహాలక్ష్మమ్మ ఆవిర్భావాన్ని వివరిస్తున్న పొన్నూరు

ఒంగోలు టౌన్: స్థానిక గాంధీరోడ్డులోని గీతామందిరంలో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న శ్రీమహాలక్ష్మమ్మ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అమ్మ జననం, జగద్గురువులు ఆదిశంకరులు చెప్పిన కనకధారా స్తోత్రంపై ప్రవచనం చేశారు. శ్రీమహాలక్ష్మమ్మ అనుగ్రహంతో సిరిసంపదలు, సుఖశాంతులు లభిస్తాయని చెప్పారు. ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున క్షీర సాగర మదనం నుంచి శ్రీ మహాలక్ష్మమ్మ ఆవిర్భవించినట్లు వివరించారు. సర్వజగత్తును నడిపించ గల శక్తి మహాలక్ష్మమ్మకు మాత్రమే ఉందని, ఆమె అనుగ్రహం కోసం నిత్యం ఉపాసన చేయడం ఒక్కటే మార్గమని అన్నారు. అమ్మ అనుగ్రహం కోసం ఆదిశంకరాచార్యులు కనకధారా స్తోత్రం పఠించి పేద బ్రాహ్మణి దారిద్ర్యాన్ని తొలగించి బంగారు ఉసిరికల వర్షం కురిపించిన కథాగమనాన్ని ఆసక్తికరంగా వినిపించారు. ప్రతిఒక్కరూ అమ్మ అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆకాంక్షించారు. గీతామందిరం భక్తులు కృష్ణ, సరేఖ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గో పూజ

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం సందర్భంగా నారాయణస్వామి ఆలయంలో అభిషేకం, అర్చన, గో పూజ, మహా నివేదన, పల్లకీసేవ తదితర పూజలు చేశారు. మహా నివేదన పూజల్లో భాగంగా భక్తులు పొంగళ్ల చేతబూని స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్ల సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయ పూజారి సత్యనారాయణశర్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణ రెడ్డి, ముదుమాల నారాయణరెడ్డి భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం, పబ్బిలేటిపల్లి గ్రామానికి చెందిన గొల్లెం శ్రీనివాసులు సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.



గోపూజ చేస్తున్న పూజారులు, పాల్గొన్న భక్తులు

గుడి స్థలంలో ఆక్రమణలు తొలగించాలి

సింగరాయకొండ: స్థానిక బాలయోగినగర్‌లోని బాలయోగి స్వామి గుడి స్థలంలో ఆదెయ్య అనే వ్యక్తి నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకుడు సంగోతు వసంతరావు మాట్లాడుతూ.. బాలయోగినగర్‌లోని సర్వే నంబర్ 668లోని 9వ నంబరు ప్లాటులో 3 సెంట్ల స్థలానికి 2008లో అప్పటి ప్రభుత్వం సుంకర వెంకటలక్ష్మమ్మ పేరు మీద పట్టా మంజూరు చేసిందని తెలిపారు. ఆ ప్లాటును ఆదెయ్య అనే వ్యక్తి ఆక్రమించి రెవిన్యూ అధికారులను ప్రలోభ పెట్టి పంభారవిబాబు అనే పేరు మీద 5 సెంట్లకు స్వాదీన పత్రాన్ని సృష్టించాడని ఆరోపించారు. ఆ స్థలంలో ఇల్లు నిర్మించినట్లు, 2010-2011 నుంచి 2022-2023వ సంవత్సరం వరకు ఇంటి పన్ను, కుళాయి పన్ను చెల్లించినట్లు పంచాయతీ కార్యదర్శితో కుమ్మక్కై తప్పుడు పత్రాలు సృష్టించాడని చెప్పారు. వాస్తవానికి 2022 మే నెల వరకు ఆ స్థలంలో ఎటువంటి కట్టడాలు లేవని ఆ తర్వాతే ఇల్లు నిర్మించారన్నారు. లక్షలాది రూపాయల విలువైన స్థలం కాజేసిన వ్యక్తికి సహకరించిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలయోగిస్వామి దేవస్థానం స్థలంతోపాటు మంచినీటి బావి, పంచాయతీ రోడ్డు, ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కూడా ఆదెయ్య ఆక్రమించి ఇల్లు నిర్మించాడని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అక్రమ కట్టడాలు తొలగించాలన్నారు. లేదంటే వాటిని తొలగించేవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాలనీవాసులు పాపిశెట్టి వెంకటేశ్వర్లు స్వామి, హనుమయ్య, అశోక్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా ఈర్లగంగమ్మ సీసీ రోడ్డు నిర్మాణం

బల్లికురవ: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈర్లగంగమ్మ ఆలయానికి వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయి. బల్లికురవ నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పడమర భాగంలో నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలో ఈర్లకొండకు ఎగువ భాగంలో ఈర్లగంగమ్మ స్వయంభుగా వెలసింది. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఆలయానికి వెళ్లే దారి 450 మీటర్లు మోకాటిలోతు గోతులతో అధ్వానస్థితికి చేరించి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయాలను నక్కబొక్కలపాడు సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్య, గ్రామస్తులు ఇటీవల రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య దృష్టికి తెచ్చారు. ఆయన మండల నిధుల్లో రూ. 20 లక్షలు కేటాయించి నిర్మాణ పనులకు సంబంధించి ఇటీవల భూమి పూజ చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ జీ. హనుమంతరావు సాక్షికి తెలిపారు. ఈనెలాఖరులోపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని ఏప్రిల్ 6న జరిగే తిరునాళ్లకు ఇబ్బందులు లేకుండా చేస్తామని ఏఈ వివరించారు. ఇదే సీసీ రోడ్డులో ఒక కల్వర్టు నిర్మాణం, ఎర్త్‌వర్క్ చేపడతామని చెప్పారు. నిర్మాణ పనులు జరిగే 20 రోజులు భక్తులు, వాహనదారులు సహకరించాలని సర్పంచ్ కోరారు.

జూదరుల అరెస్ట్

బేస్తవారిపేట: మండలంలోని బార్లకుంటలో ఆదివారం కోడిపందెం కాస్తున్నవారిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై మాధవరావు తెలిపారు. అందిన సమాచారంతో పది మందిని అరెస్ట్ చేసి.. ఏడు కోళ్లు, రూ.7,100 నగదు, 12 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు.